

కథ 1994

11

# లక్ష్మీ కటాక్షం

తోలేటి జగన్మోహనరావు

లక్ష్మీదేవికి ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, స్టాక్‌మార్కెట్‌లక్ష్మి - ఇలా అనేక రూపాలున్నాయిట. అసలు లక్ష్మీదేవే చపలచిత్తురాలు. అయితే స్టాక్ మార్కెట్ లక్ష్మి మహా మహా చపలచిత్తురాలు.

ఎవరిని ఎప్పుడు కటాక్షించి అందల మెక్కిస్తుందో, ఎవరిమీద ఎప్పుడు శీతకన్ను వేస్తుందో ఎవరికీ తెలియదు.

మహా మహా లోతులు తెలిసిన గజ ఈతగాళ్లే మునిగిపోతుంటే, ఈ స్టాక్‌మార్కెట్ సుడిగుండంలోకి నేను దూకడం లేదని ఒకే బాధ పట్టుకుంది మా ఆవిడకి ఈమధ్య. ఇప్పుడు పార్టీలకెళ్లినా, పెళ్లిళ్లకి, పేరంటాలకి- ఎక్కడికి వెళ్లినా ఇదే టాపిక్ కదా!

"మనకి రెండు వెంపులా వ్యాపారం అచ్చిరాదు," అని స్పష్టంగా కుండ బద్దలు కొట్టినట్లు, కాఫీ తాగేసి, కాఫీ కప్పు, సాసరు బద్దలుకొట్టి మరీ చెప్పాను. "మా తాత ధాన్యం వ్యాపారం చేసి పొలం అమ్మేశాడు. మా నాన్న బట్టలకొట్టు పెట్టి ఇల్లమ్మేశాడు. మా మావగారు ఆరు రీళ్ల సినిమా తీసి పదహారెకరాలమ్మేశాడు."

"ఆయన సంగతెందుకు ఇప్పుడు?" రుసరుసలాడుతూ అంది మా ఆవిడ.

"ఆయన సంగతి నాకెందుకు? వ్యాపారం మనకు అచ్చిరాదని సోదాహరణంగా వివరిస్తున్నాను- అంతే."

'అచ్చిరాదని కూర్చుంటే కాదు. కొంచెం ఆసక్తి పెంచుకుని చేస్తే ఎందుకు అచ్చిరాదు,' అని అప్పట్నుంచీ స్టాక్‌మార్కెట్లో ఆసక్తి పెంచడానికి నా బ్రెయిన్ వాష్ చేసే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆ ప్రయత్నాలలో భాగంగా ఓరోజు వంటింట్లో అంట్లు తోముతూ ఉదయ కార్యక్రమాలు ప్రారంభించింది- "వనజగారి మొగుడికి ఏదో షేరమ్మితే ఇరవైవేలు లాభం వచ్చిందట- మనవూ ఉన్నాం- ఎందుకు? అదృష్టమంటే అలా ఉండాలి," అంది అంతకు ముందురోజు పేరంటం విశేషాల సంక్షిప్త వార్తలు చెబుతూ,

పేరంటంలో ఆడవాళ్లు చక్కగా నగలు, చీరలు గురించి మాట్లాడుకుని, ఇరుగమ్మ పొరుగమ్మ గురించి చెవులు కొరుక్కోకుండా షేర్ల గురించి మాట్లాడుకోవడవేవిటో నాకు అర్థంకాదు. ఆ ప్రస్తావన తీసుకొచ్చి పొద్దుటే అంట్లతో పాటు నన్ను కూడా తోమడం నాకు నచ్చలేదు. అందులోనూ ఎవడో సన్నాసితో పోల్చి నన్ను తక్కువ చెయ్యడం అసలు సహించరాని విషయం. ఇల్లాంటి సంభాషణలు ఎలా మొగ్గలోనే తుంచెయ్యాలో నాకు బాగా తెల్సు.

"వనజ ఎవరు? తెల్లగా, స్లిమ్‌గా- పక్క వీధిలో ఉంటుంది ఆవిడే కదా."

"తెల్లగా, స్లిమ్‌గా నా కళ్లకెవ్వరూ కనిపించలేదు కాని ఉండేది పక్కవీధిలోనే."

"ఆవిడ మొగుణ్ణయితే నాకూ ఆ అదృష్టం పట్టేది."

వంటింట్లో ఓ చిన్న భూకంపం వచ్చి ధణధణ గిన్నెలన్నీ మోగి నిశ్శబ్దమైంది.

"వెధవా- స్కూలుకి టైమవుతోంది, నీళ్లోసుకున్నావా?" సుపుత్రుణ్ణి ఉద్దేశించి కేక విన్పించింది క్షణం తర్వాత,

"నీళ్లు కాగాయని చెప్పావా?"

''మాటకి మాట ఎదురు చెప్పడం మాత్రం వచ్చు ఇంకేం తెలీకపోయినా.'' రెండు క్షణాలు ఆలస్యంగా మనం కొట్టిన దెబ్బకు సమాధానం డొంక తిరుగుడుగా వచ్చింది.

అల్లాంటి చిన్న చిన్న అపజయాలకి బెదిరిపోయే రకం కాదు మా ఆవిడ. రెండు రోజులు ఆగి బ్రెయిన్ వాషింగ్ కార్యక్రమం మరింత ఉధృతం చేసి ఊదర గొట్టసాగింది. ఇంక నేను తెల్లజెండా ఎత్తేసి లొంగిపోయే సమయంలో ఊపిరి పీల్చుకుని నిలదొక్కుకోడానికి ఓ మంచి అవకాశం వచ్చింది.

''మీ నాన్న దగ్గర్నుంచి ఫోనొచ్చింది. గుంటూరులో రెండో తారీకున మీ పినతల్లి కొడుకు పెళ్లిట. వాళ్లంతా అలా వెడతారుట. నిన్ను తిన్నగా గుంటూరు వచ్చెయ్యమన్నారు,'' అని శుభవార్త చెప్పాను.

''అదేవిటి ఇవాళ ముప్ఫయి ఒకటి. రెండు రోజుల్లో పెళ్లేవిటి? ముందే చెప్పొచ్చుగా.''

''హఠాత్తుగా అలా పెళ్లి నిశ్చయం చేశారంటే ఏదో పెద్ద విశేషమే ఉంటుంది,'' అన్నాను నేను సస్పెన్సుగా,

''అయితే, వెంటనే వెళ్లాలి,'' అని రాత్రికి రాత్రే గుంటూరు వెళ్లిపోయింది మా ఆవిడ.

మర్నాడు సాయంకాలం సినిమాకెళ్లి, రాత్రి పదింటికి కొంపకి చేరి, ఇంటి తలుపులు తెరిచి వుండడం చూసి ఆశ్చర్యపోతూ లోపలికి అడుగుపెట్టి, సోఫాలో పులిలా కూర్చున్న మా ఆవిడ్ని చూసి ఉలిక్కి పడ్డాను. ''అదేవిటి అలా తిరుగుటపాలో వచ్చేశావేటి?''

''పెళ్లి గుంటూరులో కాదు, ఉంగుటూరులో,'' సీరియస్‌గా అంది మా ఆవిడ- ''రెండున కాదు, ఇరవై రెండున.''

''మరి మీ నాన్న అలా చెప్పాడే.''

''మా నాన్న సరిగానే చెప్పారు. మీకు చెవుడు కదా. సరిగా విన్పించి ఉండదు.''

నాకు కొద్దిగా చెవుడేమోనని అప్పుడప్పుడు, ముఖ్యంగా ఫోన్లో మాట్లాడినప్పుడు అన్పిస్తుంది కాని తను అనవసరంగా గుంటూరు వెళ్లడానికి కారణం నేనే అని మా ఆవిడ ఆరోపించడం నాకు నచ్చలేదు. అంచేత ఎదురుదాడి మొదలుపెట్టాను.

''నాకు సరిగానే విన్పిస్తుంది. మీ నాన్నని ఈసారి ఫోన్లో మాట్లాడేప్పుడు గోవిందరాజుల సుబ్బారావులా ఫోజుగా చుట్ట నోట్లో పెట్టి, ఉంగుటూరుని గుంటూరన కుండా, చుట్ట తీసి, ఉం...గు...టూ...రు... అని స్పష్టంగా పలకమని చెప్పు.''

''గోవిందరాజుల సుబ్బారావెవరు?''

''పాత సినీమాల్లో విలను.''

''మా నాన్న పాత సినిమాల్లో విలన్లా ఉండరు.''

''పోనీ కొత్త సినిమా- పసిపిల్లల స్కూల్లో బాంబులు పెట్టేసి, నోట్లోంచి చుట్ట తీసి, హ... హ... హ... అని వికటాట్టహాసం చేస్తూ ఫ్యూజ్‌వైరు అంటించే కొత్త సినిమాల్లో ముసలి విలననుకో.''

''నేనన్నదానికి, మీరు మాట్లాడుతున్నదానికి సంబంధవేవైనా ఉందా?''

''నాకు చెవుడు అంటే అలాగే మాట్లాడుతాను,'' నేను అడ్డంగా వాదించడం మొదలుపెట్టానంటే నా ముందు ఎవరూ నిలవలేరు.

''ఉన్నమాటంటే ఉలుకెందుకో, మిమ్మల్ని భగవంతుడు కూడా మార్చలేడు,'' అని నమస్కారం పెట్టింది కాని, దేవుడు కూడా చెయ్యలేని పని దేవాంతకురాలు చేసింది. చివరకు నేను స్టాక్‌మార్కెట్లో దిగక తప్పలేదు. ఓ డజను కంపెనీల అప్లికేషను ఫారాలు తీసుకొచ్చి పూర్తిచేసి పంపించాను. నాలుగు నెలల తర్వాత ఎనిమిది తిరిగొచ్చాయి. రెండు తిరిగి రాలేదు. అవేమయ్యాయో ఇంతవరకూ అజాపజా లేదు. రెండు షేర్లు తగిలాయి. కానీ, అమ్మబోయేటప్పటికి పది రూపాయల షేర్లు ఏడుకి, ఎనిమిదికి దిగిపోయాయి.

''అయ్యో, అడుగులోనే హంసపాదు,'' అంది మా ఆవిడ.

''ఏం పాదు?''

''హంసపాదు కాదు - ఐరన్ లెగ్ నాన్నది. అడుగు పెడితే నాశనం,'' అన్నాడు ఏడోక్లాసు చదువుతున్న సుపుత్రుడు. వాడికి ఈమధ్య సినిమా పరిజ్ఞానం ఎక్కువైంది.

''నువ్వు నోరు ముయ్యరా వెధవా,'' అన్నాను వాడి నెత్తిమీద ఒకటందుకుని.

నష్టం రావడంతో ఇంక ఆ గోల వదిలేస్తుందేమో ననుకుంటే, ''మీకు తెలియకపోతే తెలిసిన వాళ్లనెవ రైనా అడగండి కాని, ఇలా అయినదానికి కానిదానికి అప్లికేషన్లు పంపి డబ్బు తగలెయ్యొద్దు,'' అని మళ్లీ సతాయింపు మొదలుపెట్టింది.

స్టాక్‌మార్కెటుతో కొద్దిగా పరిచయం ఉన్న స్నేహితుడిని సలహా అడిగాను. అతను, ''ప్రైమరీ మార్కెట్లో ఏం సంపాదిస్తావు- సెకండరీ మార్కెట్లోకి దిగు,'' అన్నాడు.

''అంటే...'' అన్నాను నేను డైరీ తీస్తూ.

ఇదివరకు బృహస్పతో, కాళిదాసో - ఎవరో గుర్తు రావటం లేదు- ఓ సుభాషితం చెప్పారు. ధీరులైన వాళ్లు అసలు ఏ పనీ చెయ్యరట- ఒకవేళ మొదలు పెట్టారా దాని అంతు చూసేదాకా వదలరట. ఆ కోవకు చెందినవాణ్ణి నేను. స్టాక్‌మార్కెట్లో దిగాకా ఓ డైరీ పెట్టుకుని, అందులో దానికి సంబంధించిన వివరాలన్నీ రాయడం మొదలుపెట్టాను. రేప్పొద్దున్న ఎవరైనా నరసింహం ఇంత గొప్పవాడు ఎలా అయ్యాడు అని నా జీవితచరిత్ర రాయాలనుకుంటే వాళ్లకి ఆధారా లుంచి వెళ్లాలి గదా!

''ప్రైమరీ మార్కెట్టంటే కొత్త ఇష్యూలకి అప్లికేషన్లు పంపించడం. సెకండరీ మార్కెట్టంటే బ్రోకరు దగ్గర్నుంచి షేర్లు కొనడం,'' అని వివరించాడు నా మిత్రుడు.

''ఏవైనా మంచి షేర్లుంటే చెప్పు.''

అతను ఓ అరడజను షేర్లు చెప్పాడు. ఓ నలభై వేలు పెట్టి అవి కొన్నాను. ఆర్నెల్ల తర్వాత మూడు పైకి లేచాయి. మూడు కిందికి పోయాయి. లాభం లేదు, నష్టంలేదు. నరసింహంగాడి గొంగళి ఎక్కడ వేసింది అక్కడే ఉంది.

''అంతా వేలకి వేలు సంపాదించేస్తున్నారు. మన కర్మ,'' అంది మా ఆవిడ.

''ఐరన్ లెగ్,'' అన్నాడు సుపుత్రుడు.

అంతా ఎలా సంపాదిస్తారో నాకు అప్పుడే కాదు, ఇప్పుడూ అర్థం కాదు. ఒకడు పోగొట్టుకుంటేనే కదా మరోడి జేబులోకి పోయేది.

''ఏవిటి గురూ ఇలా ఉంది,'' అన్నాను నా స్నేహితుడితో,

''నా పరిస్థితీ అలాగే ఉంది. నాకు దీంట్లో లోతు పాతులు అంతగా తెలియవు. బంగార్రాజుని అడగ కూడదా,'' అన్నాడు.

''ఏ బంగార్రాజేవిటి? కాలేజీ రోజుల్లో మీ ఇద్దరూ రూమ్మేట్లు కూడా అనుకుంటా. నేను స్వీటు తిన్నప్పు డల్లా 'బూర్జువా' అని తిడుతుండేవాడు- ఆ బంగా ర్రాజా?''

''వాడే. రెండు చేతులా సంపాదించేస్తున్నాడు. వాణ్ణి సలహా అడుగు,'' అన్నాడు.

బంగార్రాజు దగ్గరకి వెళ్లడానికి మొదట కొంచెం సందేహించాను. దానికి కారణం ఉంది. బంగార్రాజుకి తనకి ఫస్టుక్లాసు రాకపోవడానికి కారణం నేనే అని అపోహ ఒకటి అప్పట్నుంచీ ఉంది. 'ఈ పీనట్ బ్రెయిన్ గాడు- బఠాణీగింజ సైజు మెదడుట నాది- కాకుండా ఇంకెవరైనా రూమ్మేటుగా ఉంటే ఐ.ఎ.యస్. కూడా పాసయ్యేవాణ్ణి,' అని నా ఎదురుగానే అందరికీ చెప్పి వాపోతుండేవాడు. కానీ, నిజం అది కాదని నా ఉద్దేశం. బంగార్రాజుకి అపరాధ పరిశోధక నవలలంటే పిచ్చి. పావలా లైబ్రరీలకి వేలు తగలేసి ఇరవైనాలు గ్గంటలూ అవే తెగ చదువుతుండేవాడు. అవి ఎక్కువ చదివితే బ్రెయిన్ ఎఫెక్టు ఇస్తుందని నా ఉద్దేశం. ఆ మాటంటే, 'నీ తలకాయ. అవి చదువుతే బుర్ర పదునెక్కుతుంది. నువ్వు కూడా చదువు,' అని నాకు ఎదురు సలహా ఇచ్చాడు.

మొదట్లో కొంచెం తటపటాయించినా, బృహ స్పతిగారు చెప్పిన పట్టు వదలని విక్రమార్కుణ్ణిగదా- ఒకరోజు శుభముహూర్తం చూసి బంగార్రాజింటికి వెళ్లాను. పూలతోట మధ్య అందంగా చిన్న డాబా కట్టు కున్నాడు. నేను కాలింగ్ బెల్ మోగించగానే బంగార్రాజే తలుపు తీశాడు.

కాలేజీ రోజుల్లో బంగార్రాజు సన్నగా, రివటలా ఉండేవాడు. ముతక ఖాదీ పైజామా, లాల్చీ- భుజానికి వేలాడే సంచి, పిల్లిగడ్డం. అచ్చు సినిమాల్లో విప్లవకారుడి గెటప్‌లోఉండేవాడు.

ఇప్పుడు బంగార్రాజు బాగా ఒళ్లు చేసి, చింతపం డెట్టి తోమిన ఇత్తడి గుండిగలా నిగనిగలాడుతున్నాడు. మెళ్లో బంగారు గొలుసు, పైజమా, లాల్చీ, తెల్లవే కాని ఖరీదైనవి.

''నువ్వా?'' అన్నాడు నన్ను చూసి ఉలిక్కిపడి.

''నేనే,'' అన్నాను అడుగుపెట్టి.

''బావున్నావా?''

''నీ పాదం పడని ఇన్నేళ్లు బ్రహ్మాండంగా వున్నాను,'' అన్నాడు బంగార్రాజు, నన్ను చూడడం తనకి ఆనందం కలిగించే విషయం కాదని స్పష్టం చేస్తూ. అంతమాత్రానికి వెనక్కి నడిచే బాపతు కాదు నేను. ఆ విషయం బంగార్రాజుకీ తెల్సు.

''ఏవిటి చాలా సంపాదించేసినట్టున్నావు,'' అన్నాను బంగార్రాజు బొజ్జ రెండు చేతులతోనూ కొలుస్తూ.

''వచ్చిన పనేవిటో చెప్పు,'' అన్నాడు చేతులు విదిలించుకుని.

''ఏదో స్నేహితుడివి కదా చాల కాలవైంది నిన్ను చూసి అని,'' అన్నాను సోఫాలో కూర్చుంటూ,

"ఇన్నేళ్ల తర్వాత వచ్చావంటే ఏదో విశేషం వుండక పోదు. వెధవ ఫార్మాలిటీస్ అక్కర్లేదు. తొందరగా ఏడు, అవతల బిజీగా ఉన్నాను," అన్నాడు బంగార్రాజు,

"ఏం లేదు. స్టాక్ మార్కెట్ గురించి నీ సలహా తీసుకుందామని," అన్నాను.

"స్టాక్‌మార్కెట్టా? నువ్వా?" అన్నాడు బంగార్రాజు - ఉత్తర కుమారుడు యుద్ధానికెడతానంటే బృహన్నల ఆశ్చర్యపోయినట్లు ఆశ్చర్యపోతూ,

"నేనే," అన్నాను స్పష్టం చేస్తూ

"నీ ఐక్యూ ఎంతో నాకు తెల్సు, షేరు మార్కెట్టంటే సినిమా టిక్కెట్లు బ్లాకులో కొని, సిల్కుస్మిత తెర మీదకు రాగానే ఈలవెయ్యడం కాదు," అన్నాడు బంగార్రాజు.

"నేనెప్పుడు బ్లాకులో టిక్కెట్టు కొని సినిమా హాల్లో ఈలవేశాను," అనడిగాను అమాయకంగా.

"నువ్వు ఎప్పుడు ఈలలేశావో నీ ఈలలకి చెవుడొచ్చి ఈయెన్టీ స్పెషలిస్టులకి వందలు వదిలించుకున్న వాళ్లు చెబుతారు కాని బోనులోకి ఎలక దూరినట్లు స్టాక్ మార్కెట్లో దిగకు తోక కట్టయిపోతుంది. జాగ్రత్త, స్టాక్ మార్కెట్లో దిగేవాడు ఎలా ఉండాలో తెల్సా?" అంటూ మొదలుపెట్టాడు బంగార్రాజు.

"ఇదివరకు ఎప్పుడో ఇంగ్లండుకి, ఫ్రాన్సుకి పెద్ద యుద్ధం జరిగిందట. ఆ యుద్ధం ఇంగ్లండుకి జీవన్మరణ సమస్యట. అప్పుడో పెద్దమనిషి ఆ యుద్ధంచేసే జనరల్‌గారికి పదో పన్నెండో పావురాలిచ్చాడుట యుద్ధ వార్తలు పంపించమని. యుద్ధంలో చివరకు ఇంగ్లండ్ నెగ్గిందట. ఆ వార్త పావురాల టపా ద్వారా అందరికంటే ముందు మన గురూగారికి అందింది. వెంటనే ఆయన ఏడుపుమొహం పెట్టుకుని స్టాక్‌మార్కెటుకి వెళ్లి ఆయన దగ్గరున్న షేర్లన్నీ అమ్మేశాడు. ఆయన అమ్మడం చూసి యుద్ధంలో ఇంగ్లండ్ ఓడిపోయిందనుకుని గొల్లుమని అందరూ అమ్మేయడం మొదలుపెట్టారు. అలా స్టాక్ మార్కెట్ కూలగొట్టేసి ఈ పెద్దమనిషి మళ్లీ అన్ని షేర్లు కారుచౌకలో కొనేశాడుట. యుద్ధంలో ఇంగ్లండు నెగ్గిన వార్త అందరికీ తెలిసేటప్పటికి ఈయనగారు బిలియన్లకి పడగలెత్తేశాడుట.

"ఆయనగారు ఇప్పడు మనకి రోల్ మాడల్ అన్నమాట.

"స్టాక్‌మార్కెట్లో దిగేవాడు అలా స్మార్టుగా వుండాలి," అన్నాడు బంగార్రాజు.

ఆ కత వింటుంటే మాత్రం నా మనసు చివుక్కుమంది.

యుద్ధం వచ్చి దేశం శ్మశానంగా మారుతుంటే అందులో ధనరాసులు పండించడం ఎలాగా అని ఈ పెద్దమనిషి ఆలోచించడం చాలా దుర్మార్గం అనిపించింది. "త్యాగం చెయ్యడానికి మన దేశవూ, లాభాలు తియ్యడానికి నా దేశవూనా, చాలా అన్యాయం గురూ," అన్నాను.

"వెధవ సెంటిమెంటు పెట్టుకోకు. అన్యాయం లేదు, గిన్యాయం లేదు. అసలు ఇంగ్లీషులో ఓ మాటుంది- వీధుల్లో రక్తం ప్రవహిస్తుంటే స్టాక్‌మార్కెట్లో దిగమని. నీకు నీతిసూత్రాలు కావాలంటే సుమతీ శతకం, భాస్కర శతకం చదువుకో. డబ్బు కావాలంటే స్టాక్‌మార్కెట్లోకి దిగు. నీకు సూక్తి ముక్తావళి కావాలా, డబ్బు కావాలా?"

"డబ్బు... డబ్బు... డబ్బు..." అన్నాను హుషారుగా, డబ్బు మాట వినబడగానే నా కళ్లకు కట్టిన మాయ పొరలు తొలగిపోయి, "నువ్వు బాగా స్టడీ చేసి ఓ షేరు చెప్పు. ఉన్నదంతా దాని మీద కాసేస్తా."

"అదిగో, నీ పీనట్ బ్రెయిన్ ఎలా పనిచేస్తోందో చూశావా. స్టాక్‌మార్కెట్టంటే లాటరీ అనుకున్నావేవిటి? తోక తెగిపోగలదు. కోడిగుడ్లన్నీ ఎప్పుడూ ఒకే బుట్టలో పెట్టకూడదు. పది బుట్టల్లో సర్దాలి. ఒకచోట నష్టపోయినా, ఒకచోట లాభం వస్తుంది," అని బుట్టల న్యాయం చెప్పాడు బంగార్రాజు.

"అలా అయితే మజా ఏం ఉంది? మనకి లాభం ఉండదు, నష్టం ఉండదు, థ్రిల్ ఉండదు. పెద్దనగారు చెప్పినట్లు సింహంపిల్ల ఆకలేసినా..."

"మళ్లీ మొదలెట్టావూ- పెద్దనగారు కాదు. తెలియకపోతే తెలియనట్లు పడుండకూడదూ," అన్నాడు బంగార్రాజు తల కొట్టుకుంటూ,

"పెద్దనగారు కాకపోతే పోతనగారు, లేకపోతే మరొకరు. పాయింటేవిటంటే, సింహం పిల్ల ఆకలేసినా గడ్డి తినదు. మదించిన ఏనుగు కుంభస్థలాన్ని బద్దలు కొడుతుంది కాని. నా పేరే సింహం. నేను గడ్డి తినను. మంచి షేరొకటి చెప్పు. దాని కుంభస్థలం పగలగొట్టేస్తా. విజయమో, వీరస్వర్గమో ఏం జరుగుతుందో సరదాగా చూద్దాం," అన్నాను.

"ఏట్లోకి దూకి ఏం జరుగుతుందో చూడాలని సరదాగా ఉంటే దూకు. కాని చూడ్డానికి మాత్రం నువ్వుండవు. నువ్వెళ్లే దారిలో విజయం లేదు, వీర స్వర్గమే," అన్నాడు బంగార్రాజు హెచ్చరిస్తూ.

''నువ్వేం భయపడకు. నీ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. సింహానికి గడ్డొద్దు. కుంభస్థలవే కావాలి,'' అన్నాను బంగా(్రాజుతో ఫైనల్‌గా.

నీ కర్మ అని ఆ తర్వాత బంగా(్రాజు స్టాక్ మార్కెట్ ఏబీసీడీలు ఓ రెండు గంటలు వివరించాడు.

''అలా గేదెలా తలూపుతున్నావుగాని ఏమైనా బు(్రకెక్కిందా?'' అన్నాడు రెండు గంటల తర్వాత రెండు గ్లాసుల నీళ్లు తాగి.

''(బ్రహ్మాండంగా అర్థమైంది. సెన్సెక్స్ పడిపోతున్నప్పుడు కొనడం మొదలుపెట్టాలి. లేస్తున్నప్పుడు అమ్మడం మొదలుపెట్టాలి. చాలా సింపుల్. అయిదు వేలదాకా అంకెలు లెక్కెట్టగలిగేవాడెవడైనా చెయ్యొచ్చు బిజినెస్. నాదాకా ఎందుకు మా కుర్రాడి చేత చేయిస్తాను. సెన్సెక్స్ అయిదువేలు దాటితే నేను రంగంలోకి దిగుతాను. నువ్వేం వర్రీ అవకు,'' అన్నాను.

''వర్రీ అవుతున్నది నీ గురించి కాదు, నా గురించి. నీ మాటలు వింటుంటే నా తల పగిలిపోతోంది. ఇంక వెళ్లు,'' అన్నాడు బంగా(్రాజు పేపరు వెయిట్‌తో తలమీద కొట్టుకుని.

''ఓకే బాస్,'' అన్నాను లేస్తూ. ''నీ ఫోను కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తా. గురూ బంగా(్రాజూ, ఓ చిన్న సందేహం. ఫోను కోసం వెయ్యి కళ్లతో అనాలా, వేయి చెవులతో అనాలా? యమ్మే తెలుగు చదివావు కదా అని అడుగుతున్నాను.''

''నా బుద్ధి తక్కువై యమ్మే తెలుగు చదివాను. నా బుద్ధి గడ్డి తిని స్టాక్‌మార్కెట్లో దిగాను. నీతో మాట్లాడి ఉన్న తెలివితేటలు కూడా పోయాయి. నాకు పిచ్చెక్కేట్టుంది. ఇంక నన్ను వదిలెయ్యరా బాబూ,'' అన్నాడు బంగా(్రాజు- రెండు చేతులూ జోడించి నమస్కారం పెడుతూ.

''ఓకే బాస్- నీ ఫోను కోసం వెయ్యి చెవులతో... టా... టా...'' అని సెలవు తీసుకున్నాను బంగా(్రాజు దగ్గర్నుంచి.

వారంరోజుల తర్వాత బంగా(్రాజు ఫోను చేశాడు. నేను వదిలే రకం కాదని తెల్సు కదా!

''హలో గురూ- బావున్నావా?'' అన్నాను.

''వెధవ పరామర్శలక్కర్లేదు. బాగా స్టడీ చేసి షేరు చూశాను- బుక్ వేల్యూ, ఈపీయస్...''

''వివరాలొద్దు. అవన్నీ నువ్వు చూశావు కదా.''

''ఇంకో మాట- స్టాక్‌మార్కెట్లో రేటు రోజూ పైనా కిందా అవుతూనే ఉంటాయి. కొన్న మర్నాటి నుంచీ, అయ్యో బంగా(్రాజూ - రేటు పడిపోయింది. ఏం చెయ్యనూ అంటూ ఫోన్చేసి నస పెట్టకు.''

''దాని గురించి వర్రీ అవకు.''

''ఆఖరిసారి వార్నింగిస్తున్నాను. స్టాక్‌మార్కెట్ నీలాంటి పీనట్ (బ్రెయిన్‌గాళ్ల కోసం కాదు. నష్టం వస్తే నన్ని లాభంలేదు. నా దగ్గరకి మళ్లీ రావద్దు. ఫోన్ చెయ్యొద్దు.''

''నేను 'కిల్లింగ్' చేసినా చెప్పొద్దా?''

''ఒద్దు... ఒద్దు...'' అన్న వెంటనే పేపరు వెయిట్తో తలమీద కొటుకున్నట్లు 'టప్' మని శబ్దం స్పష్టంగా వినిపించింది. ''పేపర్లో నల్లబోర్డరుతో నీ ఫోటో పడ్డప్పుడు సంగతి అర్థమై అంతిమ దర్శనానికి నేనే వస్తాను జాగ్రత్తగా విను- కంపెనీ పేరు గుజరాత్.''

''గుజరాత్ గోల్డ్- ఓకే బాస్- ఇంక నువ్వు నిశ్చింతగా ఉండు,'' అని నేను ఇంకా ఏదో చెప్పబోతుంటే బంగా(్రాజు ఠక్కున ఫోన్ పెట్టేశాడు.

బంగా(్రాజు ఫండమెంటల్సు అన్నీ చూసి షేరు చెప్పాడు కాని టెక్నికల్సు చూసి రంగంలోకి దిగాలి కదా! అంచేత ఓపిగ్గా సరైన సమయం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. ఓర్పు ఉన్నవాడే స్టాక్‌మార్కెట్లో సంపాదిస్తాడని బంగా(్రాజు చెప్పాడు. అదేకాకుండా ఇదివరకు ఓర్పు గల తాబేలు కుందేలుని ఓడించేసిన ఉదాహరణ కూడా ఉంది!

అలా నిశ్చింతగా పడుకున్న నా చెవిలో- క్షమించాలి- వాక్యనిర్మాణం సరిగ్గా ఉన్నట్లులేదు పడుకున్నది నా చెవి కాదు- నేనే. పడుకున్న నా చెవిలో ఓ రోజు ఉదయం ఏడుగంటలకి మా సుపు(్రతుడు, ''నానోయ్,'' అని అరిచాడు కొంపలు మునిగిపోయి నట్లు.

''వెధవా- స్కూలుకి తయారవలేదా?'' అన్నాను నేను ఉలిక్కిపడి లేచి,

''నాకు స్కూలు లేదు- మీకు ఆఫీసు లేదు- నగరంలో కర్ఫ్యూ,'' అన్నాడు వాడు సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ.

ఎక్కడో ఏదో మతంవారు రోడ్లమీద (ప్రార్థన చేసుకుంటే మరో మతంవాడు ఆ రోడ్డు మీద పోతూ తుమ్మాడుట. వాళ్ల (ప్రార్థనకి అంతరాయం కలిగించడానికే వాడు అలా తుమ్మాడని వాళ్లు ఆగ్రహించారు. మానవహక్కుల కిందే కాకుండా రాజ్యాంగం (ప్రసాదించిన (ప్రాథమిక హక్కుల (ప్రకారం కూడా తనకు తుమ్ము వస్తే తుమ్మే జన్మసిద్ధమైన హక్కుందని వాడు వాదించాడు. మాటామాటా పెరిగి వాళ్లు వాణ్ణి పొడిచేశారు.

ఆ తర్వాత వాడి తరఫువాళ్లు వచ్చి దుకాణాలు, ఇళ్లూ అంటించేశారు. క్షణంలో దావానలం నగరం నుంచి రాష్ట్రానికి, రాష్ట్రం నుంచి దేశానికి వ్యాపించి, వారం రోజుల్లో ఓ వెయ్యిమంది పైగా బలైపోయారు.

స్టాక్‌మార్కెట్ మూతపడింది. సెన్సెక్సు పడుకుంది. వీధుల్లో రక్తం ప్రవహిస్తోంది- అన్నీ శుభ సూచనలే- ఇంక మనం స్టాక్‌మార్కెట్లో దిగే టైమొచ్చేసింది. ఓ మంచి ముహూర్తం చూసి బ్రోకరు దగ్గరకు బయలుదేరాను.

పెళ్లి మధ్యలో మగపెళ్లివారు లేచిపోతే ఆడపెళ్లివారిల్లు ఎలా ఉంటుందో ఎప్పుడైనా చూశారా- నేను చాలా సినిమాల్లో చూశాను- అలా దిగులుగా నిద్దరోతోంది బ్రోకరు ఆఫీసు. అక్కడున్న నలుగురిలోనూ ముగ్గురు కునికిపాట్లు పడుతున్నారు. కంప్యూటరు ముందు కూర్చున్న నాలుగోవాడితో ఎవరో కష్టమరు కాబోలు మెల్లిగా మాట్లాడుతున్నాడు. నిద్రపోతున్న వాళ్లలో ఒకణ్ణి లేపి నేను వచ్చిన పని తెలియజేశాను.

"ఏ కంపెనీ?" అన్నాడు అతను ఆవలిస్తూ.

"గుజరాత్ గోల్డ్."

"పేరు ఎప్పుడూ విన్లేదే?" అని తల గోక్కుని, కంప్యూటరు దగ్గర కూర్చున్న కుర్రాడికేసి తిరిగి, "గుజరాత్ గోల్డ్ అసలు లిస్టయిందో లేదో చూడు," అన్నాడు. అతను అలా అంటుంటే అక్కడున్న కష్టమరు చెవులు ఎలర్టయి, నిక్కబొడుచుకుని గాడిదచెవుల్లా రెండు మూడుసార్లు పైకీ క్రిందికీ ఊగడం నేను గమనించాను.

కంప్యూటరు దగ్గర కుర్రాడు కీలు నొక్కి "గుజరాత్ గోల్డ్- బాంబేలో ఎనిమిది నెలల క్రితం ఓ రోజు ఇరవై తొమ్మిదికి ట్రేడయింది," అన్నాడు.

ఈపాటికి గాడిద చెవుల తాలూకు మెదడుకు విషయం బోధపడి ఆదేశాలు పంపించినట్లుంది. హఠాత్తుగా అతను గిర్రున వెనక్కి తిరిగి లేచి, "ఏవిటి, గుజరాత్ గోల్డ్ కావాలా?" అంటూ పెద్దగా అరిచి నా మీదకు దూకి నన్ను కిందపడేసినంత పనిచేశాడు.

గొప్పగొప్పవాళ్లలా నా బుర్ర ఒకే ట్రాక్‌లో ఆలోచించడానికి అలవాటుపడింది. అనుకోనిదేదైనా తటస్థపడితే అదేమిటో అర్థమయ్యేదాకా నా బుర్ర కొంచెం సేపు పనిచెయ్యడం మానేస్తుంది. మెడకాయ మీద ఆలోచించే తలకాయ ఉన్నవాళ్లకెవరికేనా ఇలా జరుగుతుందని నా ఉద్దేశం కాని, మా ఆవిడ మాత్రం 'ఏవిటలా వెర్రిమొహం వేస్తారు,' అని దాన్ని వెర్రి మొహంగా వర్ణిస్తుంది.

ఆ పెద్దమనిషి నా మీద అలా దూకేటప్పటికి నా బుర్ర రెండు నిమిషాలు పనిచెయ్యడం మానేసింది. అంటే నేను ఉలుకూపలుకూ లేకుండా మా ఆవిడ చెప్పినట్లు వెర్రిమొహం వేసుకు చూస్తూ ఉండిపోయానన్నమాట. రెండు నిమిషాల తర్వాత స్పృహ వచ్చేప్పటికి అతను అంటున్నాడు- "ఓ అయిదొందలు- ఏదో రేటుకి తీసుకోండి. పోనీ ఇరవై అయిదివ్వండి."

ఇరవై అయిదివ్వమంటాడేవిటి, అని మళ్లీ బుర్ర రెండు నిమిషాలు పని చెయ్యడం ఆగిపోయింది.

"డీల్," అన్నాను నేను తేరుకుని.

"డీల్," అన్నాడు అతను.

"డీల్," అన్నాడు బ్రోకరు ఇద్దరి మధ్యా తల దూర్చి- కమిషన్ కోసం ఇద్దిరివేపు చెరో చెయ్యి చాపుతూ,

బ్రోకరు ఆఫీసు నుంచి బయటకు వచ్చిన తర్వాత అతను నా చేతులు కలిపి, "మనం పేరు తెల్సుకోకుండానే బిజినెస్ చేసేశాం. నా పేరు యస్సెన్ బుట్టా - బుట్టా సత్యనారాయణ," అన్నాడు.

"నా పేరు నరసింహం."

"సింహంగారూ - బ్రోకరుగాడు మనిద్దరి దగ్గరా కమిషను కొట్టేస్తాడని ఇందాకా చెప్పలేదు. వెయ్యి షేర్లు ఏదో ఒక రేటుకి తీసుకుంటారా?" అన్నాడు బుట్టా.

చివరకు ఓ అయిదొందలు పదమూడుకి, ఓ అయిదొందలు పదకొండుకి కుదిరింది. డీల్ అయిపోయిన తర్వాత బుట్టాగారు నా దగ్గర చెక్కు తీసుకుని, ముద్దు పెట్టుకుని, జేబులోకి తోసి, ఆప్యాయంగా భుజాల మీద చేతులేసి, "కాఫీ తాగొద్దాం రండి," అంటూ కాఫీ హోటలుకి తీసుకెళ్లి, స్వీటూ హాటూ తెప్పించాడు. నన్ను వారించి తనే బిల్లు చెల్లించాడు. మీఠా కిళ్లీలు కట్టించి, రెండు సిగరెట్లు కొని, నాకొకటి ఇచ్చి, తను స్వయంగా అగ్గిపుల్ల వేసి వెలిగించి, తనొకటి అంటించి, ఓసారి గుండెల నిండా పీల్చి పొగ మెల్లిగా వదలుతూ అన్నాడు- "మీకు స్టాక్‌మార్కెట్ కొత్తనుకుంటాను."

"కొత్తే."

"తెలుస్తూనే ఉంది. ఈ షేరు నెత్తి మీద రూపాయ పెట్టి పావలాకి కొనమంటే ఎవడూ కొనడు. అయిదొందలడిగితే ఓ వంద ఇస్తాడనుకుని మూడు అప్లికేషన్లు తగలేస్తే పదిహేనొందలు మెడకి తగులు

కున్నాయి. రెండేళ్ల నుంచి ఏ సన్యాసి దొరుకుతాడా అని... సారీ... ఎలా వదుల్చుకోవాలా అని చూస్తుంటే ఇన్నాళ్లకు మీరు దొరికారు. మిమ్మల్ని నిలువునా ముంచేశాను. లేకపోతే నేను తేలేదెలా? స్టాక్‌మార్కెట్ అంటే అంతే.'' తన పొట్టలోకి పోయిన మేకపిల్లను తల్చుకుని తోడేలు ఫిలసాఫికల్‌గా బాధపడినట్లు బాధ పడుతూ అన్నాడు బుట్టా. ''అసలు వీటి విలువెంతో తెల్సా?''

''తెలియదు చెప్పండి,'' అన్నాను అయోమయంగా,

బుట్టా ఏదో చెప్పబోయి ఆగి, ''ఓ పని చెయ్యండి. నేను మీకు సర్టిఫికెట్లిస్తాను. మా వీధి చివర పాత కాగితాల కొట్టుంది. అక్కడ తూకం వేయించండి- వాడు సరిగ్గా చెబుతాడు,'' అన్నాడు.

నా గుండె గుభేలుమంది.

నా వెర్రిమొహం చూసి అతనే మళ్లీ అన్నాడు- ''కంగారుపడకండి. ఇంతవరకు మీకు డార్కర్ సైడ్ ఆఫ్ ది పిక్చర్ చూపించాను. రెండోవేపు- బ్రైటర్ సైడేవిటంటే, 'లోతు తెలీనిచోట దిగకూడదు,' అనే అక్షర లక్షలు చేసే పాఠాన్ని చాలా చౌకలో ఇరవైవేలకి నా దగ్గర నేర్చుకున్నారు. కంగ్రాచ్యులేషన్స్ అప్పుడే గురూగారు స్టాక్‌మార్కెట్లో కిల్లింగ్ చేసేశారు. చూశారా ఇరవైవేలకి పన్నెండు లక్షలు. లక్కీ ఫెలో మీరు.''

'పిల్లికి చెలగాటం, కుక్కకి ప్రాణసంకటం' అని ఏదో అంటారే, అలా ఉంది నా పరిస్థితి.

''స్టాక్ మార్కెట్లో ఫూల్సు షేర్లు అమ్మడానికి బిగ్గర్ ఫూల్సుకోసం ఎదురుచూస్తారుట. నాకు మీరు దొరికారు. మీకు మీ అన్నగారెవరేనా దొరుకుతారేమో చూడండి,'' అన్నాడు బుట్టా పకపక నవ్వుతూ.

నేను నిజంగా తెలివితక్కువ పని చెయ్యలేదు కదా అని రవ్వంత అనుమానం వచ్చింది. నేనేదైనా తెలివితక్కువ పని చేసినప్పుడు, మా అత్తారింట్లో అందరూ నవ్వుతుంటే, మా ఆవిడ నా డిఫెన్సుగా, 'నవ్విన నాపచేను పండుతుంది,'' అంటుంది. ఆ సామెత గుర్తుకొచ్చి, చిరునవ్వు పెదాల మీదకు తెచ్చుకుని, గంభీరంగా, ''నవ్విన నాపచేను పండుతుంది,'' అన్నాను.

''నాపచేను ఎందుకు నవ్వుతుంది- నవ్వాకా ఎందుకు పండుతుంది,'' అన్నాడు బుట్టా ఆశ్చర్యంగా,

అసలు ఆ సామెతకి అర్థమేమిటో నాకూ తెలియదు. అంచేత, ''దానికి అర్థం కాలమే చెబుతుంది,'' అన్నాను ఇంకొంచెం గంభీరంగా,

అలా అన్నానే కానీ, కురుక్షేత్రంలో అర్జునుడి మనసు వికలమైనట్టు నా మనసు ఓ క్షణం వికలమైంది. కానీ, వెంటనే బంగార్రాజు స్టాకోపదేశం గుర్తుకొచ్చి నా భ్రమలన్నీ తొలగిపోయి రెట్టించిన ఉత్సాహంతో స్టాక్‌మార్కెటు మీద పడ్డాను మళ్లీ. ఇంకో వెయ్యి గుజరాత్ గోల్డు షేర్లకి ఆర్డరిచ్చినప్పుడు బ్రోకరు ఆఫీసులో అంతా చెవులు కొరుక్కుని నవ్వుకోడం నేను గమనించకపోలేదు. గుజరాత్ గోల్డ్ కొటేషను పేపర్లో వచ్చిందో లేదో దేశం నలుమూలల నుంచీ ఆ షేర్లు నా దగ్గరకొచ్చి పడసాగాయి.

మన బిజినెస్ కాకలుతీరిన బ్రోకరుకి కూడా మిస్టరీగా మిగిలిపోయింది. ''ఏవిటి సార్, మార్కెట్లో షేరు కన్పించనియ్యడం లేదు. కొంపతీసి కంపెనీ టేకోవర్ చేస్తున్నారేవిటి?'' అన్నాడు బుర్ర గోక్కుంటూ,

''ప్రస్తుతానికి ఆ ఉద్దేశం లేదుకాని, ముందు ముందు ఆకలేస్తే తినేసినా తినేస్తాను,'' అన్నాను బ్రోకరుతో మిస్టీరియస్‌గా. ఇదివరకులా నవ్వుకోకుండా ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకుని ఎవరి బుర్రలు వాళ్లు గోక్కోవడం మొదలుపెట్టారు బ్రోకరు ఆఫీసులో.

ఆఖరి వెయ్యి షేర్లు అయిదుకి కొన్నాను. అప్పటికి నా బ్యాంకు బేలన్సు అయిపోయింది. మనం కొనడం మానేశాక దాని ధర మూడు రూపాయలకి దిగి అక్కడే బబ్బుంది.

''అయ్యో... అయ్యో... పెట్టుబడంతా ఎగిరిపోయింది,'' అంది మా ఆవిడ కంగారుగా.

''బంగార్రాజేవన్నాడు,'' అన్నాను డైరీ తీసి చూపిస్తూ, ''షేర్లు రోజూ ఉయ్యాలలూగుతాయి. వాటి గురించి కంగారుపడకూడదు.''

''ఉయ్యాలలూగడవేవిటి నా తలకాయ. వుయ్యాల తాడు తెగి కిందపడి చస్తే ఇంకేం లేస్తుంది! పదిహేడెక్కడ, మూడెక్కడ,'' అంది మా ఆవిడ తల పట్టుకుని.

''నువ్వేం కంగారుపడకు. కొంతకాలం ఆగి చూడు, ఎలా లేస్తుందో,'' అని మా ఆవిడకి ధైర్యం చెప్పి, సూట్‌కేసు నిండా సర్టిఫికెట్లు నింపి అటకెక్కించేశాను.

''ఈ వెధవెక్కడ?'' అన్నాను సుపుత్రుణ్ణి ఉద్దేశించి. భావిభారత పౌరుడికి శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత ఒకటుందిగా,

''ఇక్కడే ఉన్నాను,'' అన్నాడు సుపుత్రుడు మంచం మీంచి.

''ఇలారా. ఈ గ్రాఫ్ చూశావా? దీన్ని సెన్సెక్స్ అంటారు. ప్రస్తుతం నువ్వు మంచం మీద బబ్బున్నట్టు కాళ్ల పారచాపి పడుకుంది,'' అన్నాను పేపర్లో చూపించి వివరిస్తూ. ''నీకు స్కూల్లో చెబుతున్నారా?''

''చెబుతున్నారు.''

''గుడ్. ప్రస్తుతం శవాసనం వేసింది సెన్సెక్స్. శవాసనం తర్వాత కొంచెం తలెత్తి భుజంగాసనం వేస్తుంది. ఆ తర్వాత లేచి కూర్చుని వజ్రాసనం వేస్తుంది. అప్పుడు మనం అమ్మటం మొదలుపెట్టాలి. అది లేచి నిలబడి చేతులెత్తి తాళాసనం వేసేలోగా మనం అమ్మేయాలి. లేకపోతే మళ్లీ శీర్షాసనం వేసే ప్రమాదం ఉంది. అర్థమైందా?'' ఎంత కాంప్లెక్సు విషయాన్నయినా సింపుల్‌గా చెప్పడం నా ప్రజ్ఞ.

''బ్రహ్మాండంగా అర్థమైంది. నువ్వు నిశ్చింతగా ఉండు,'' అన్నాడు సుపుత్రుడు. వాడిది నా పోలికే. ఒక సారి చెబితే అందుకుపోతాడు.

''మరింక నన్ను డిస్టర్బ్ చెయ్యకండి,'' అన్నాను నేను.

నాలుగు నెలలు గడిచాయి.

''నానోయ్- భుజంగాసనం,'' అన్నాడు సుపుత్రుడు ఓరోజు ఉదయం పేపరు చూసి.

నిజమే సెన్సెక్స్‌లో కదలిక ప్రారంభమైంది.

నా డైరీ తిరగేశాను. కట్టె పేళ్లు చిగురిస్తున్నప్పుడు షేర్లు అమ్మడం మొదలుపెట్టమన్నాడు బంగార్రాజు. దేశం పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోడానికి పేపరంతా తిరగేశాను.

కాశ్మీర్ సమస్య త్వరలోనే పరిష్కారం కాగలదని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తపరిచారు. సంస్కరణల బండిని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ చేశామని, ఇంక దాని స్పీడు తగ్గే సమస్య లేదని ఆర్థికమంత్రి ఉద్ఘాటించారు. అవసరమైతే బ్రేకులు తీసెయ్యడానికి కూడా వెనుకాడనని హెచ్చరించారు. పాకిస్తాన్ మీద ఇండియా క్రికెట్లో నెగ్గింది. ఏదో సినిమా సిల్వర్ జూబిలీ ఆడింది. అమెరికా అప్పు ఇస్తానంది. జర్మనీ అప్పు తీర్చక్కర్లేదంది. అర డజను మంత్రులు తూర్పుకు, అరడజను మంత్రులు పశ్చిమానికి ఎగిరిపోయారు జోలె పుచ్చుకుని. మొత్తం మీద దేశం పరిస్థితి మహాభిక్షంగా ఉంది. కొత్త అప్పులు పుడుతున్నాయి. కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. దేశంలో అప్పుల వర్షం కురుస్తుంటే, స్టాక్‌మార్కెట్లో ఆశల పంటలు పండకేవవుతుంది?

సెన్సెక్స్ వజ్రాసనం వేసింది రెండు వారాల్లో, కానీ, మన షేరులో కదలిక లేదు. మరో రెండు వారాలు గడిచాయి. ఓరోజు సుపుత్రుడు, ''నాన్నోయ్, మన షేరు కదిలింది,'' అన్నాడు పేపరు చూసి.

''ఎంత?'' అంది మా ఆవిడ.

''బాంబేలో ముప్ఫయి, నలభై ఉంది,'' అన్నాడు వాడు.

''ముప్ఫైయ్యేవిటిరా- నీ తలకాయ, మూడయి ఉంటుంది,'' అన్నాను నేను.

ఆ రోజల్లా ఆ అంకె మూడా, నాలుగా, ముప్ఫయ్యా, నలభయ్యా అని తలబద్దలు కొట్టు కున్నాను. అంకెలు సరిగా ప్రింటు చెయ్యని పేపరువాడి మీద చాలా కోపం వచ్చింది.

మర్నాటి పేపర్లో కూడా ఆ అంకె అలాగే వచ్చింది. ఈ మిస్టరీ ఏవిట్రా అని నిద్రపట్టక రాత్రంతా అటూ ఇటూ దొర్లి, తెల్లవారకట్ల కళ్లు ముయ్యబోతుంటే మా ఆవిడ, ''ఏవండోయ్, బాంబేలో మన షేర్ 63, 81కి పెరిగింది. ఢిల్లీలో కూడా 69, 85 ఉంది,'' అని ఫైరింజన్లా గణగణమంటూ చెప్పింది.

''ఏది, పేపరియ్యి,'' అన్నాను మంచం మీంచి దూకి.

సందేహానికి తావు లేకుండా ఉంది. కానీ, ఎందుకు పెరిగిందా అని మళ్లా తల బద్దలు కొట్టుకో బోతుంటే వ్యాపార వార్తల పేజీలో నాలుగు కాలాల హెడ్డింగుతో వార్త పడింది. గుజరాత్ గోల్డ్ కంపెనీలో స్విండ్లర్స్ అమెరికా (ఫార్చ్యూన్ - 500 కంపెనీ) మెజారిటీ వాటాలు తీసుకోబోతోందట. సంప్రతింపులు చివరి దశలో ఉన్నాయట. ఆ తర్వాత గు.గోల్డు షేర్లు మేలిమి బంగారవేనట. అంచేత షేర్ ధర చుక్కల్లోకి వెళ్లిపోతోంది.

''నిచ్చెన తీసుకురా,'' అన్నాను ఆ ఆవిడతో.

''ఎందుకు?''

''అటక మీంచి సూట్‌కేసు దింపాలి. సాయం పట్టు.''

''అప్పుడే అమ్మడం దేనికి? ఇంకా ఎంత పెరుగుతుందో చూద్దాం,'' అంది మా ఆవిడ.

''బంగార్రాజేం చెప్పాడు. రేటు పెరుగుతుండగానే షేరు అమ్మడం మొదలుపెట్టమన్నాడు. ఇప్పుడో అయిదొందలు అమ్మేద్దాం. రేపేం జరుగుతుందో

ఎవడికి తెల్సు? పంజాబులో బాంబులు పేలొచ్చు. బాంబేలో బ్రోకరు సమ్మె చెయ్యొచ్చు. వానలు పడక పోవచ్చు. వరదలు రావచ్చు. అంచేతే బూముండగానే స్టాకు చక్కబెట్టాలన్నాడు బంగార్రాజు,'' అన్నాను గురువుగారి సూక్తులు గుర్తుకు తెచ్చుకుంటూ.

మర్నాడు బ్రోకరు ఆఫీసుకి వెళ్లి ఓ అయిదొందలు అమ్మేసి బయటకు వస్తుంటే, నా భుజం మీద ఓ చెయ్యి బరువుగా పడింది. ఎవరా అని చూస్తే బుట్టాగారు. ఆయన పక్కన కొత్త స్కూటరు తళతళా మెరుస్తోంది.

''కంగ్రాచ్యులేషన్స్ గురుగారూ, నక్కతోక తొక్కి స్టాక్‌మార్కెట్లో దిగారు,'' అన్నాడు బుట్టా అభినందిస్తూ. ''ఆ సామెతకి అర్థం చెప్పలేదు.''

''ఏ సామెత?''

''నవ్విన నాపచేను.''

''అర్థం తెలియకపోయినా, అంటే ఏవిటో తెల్సింది కదా,'' అన్నాను నేను గంభీరంగా.

''తెల్సింది,'' అన్నాడు బుట్టా బాధగా, ''పదండి కాఫీ తాగొద్దాం.''

''ఈసారి బిల్లు నే చెల్లిస్తా.''

''మీరే ఇవ్వాలి. నా దగ్గరేవుంది బూడిద.''

''అదేవిటి, కొత్త స్కూటరు మీద పూలరంగడిలా ఉన్నారు. మీకేవిటి?''

''మూడు నెలల క్రితం స్కూటరు కొన్నప్పుడు పూలరంగణ్ణే. ఇప్పుడు బూడిదరావుణ్ణి. గొప్ప దెబ్బ తినేశాను సార్ స్కూటరు డిస్కౌంటుకి అమ్మేస్తా తీసుకుంటారా. హెల్మెట్ ఫ్రీ.'' అన్నాడు బుట్ట.

''ఓకే,'' అన్నాను నేను.

''అది సరేగాని గురూగారూ, ఈ నాపచేనులో బంగారం పండుతుందని మీకెల్లా తెల్సింది? ఊరికే తెల్సుకోవాలని కుతూహలంతో అడుగుతున్నాను,'' అన్నాడు.

నేను నిజం చెప్పేశాను. ''బంగార్రాజని, షేర్ మార్కెట్లో లోతుపాతులు తెల్సిన స్నేహితుడు- అతను కొనమంటే కొన్నాను కాని, నా మొహం నాకేం తెల్సు?''

''నేనూ అలాగే అనుకున్నానులెండి. ఎవరు సార్, ఎడారిలో కూడా వసంతాలు చూడగలిగిన మహానుభావుడు. ఆయన దర్శనం చేసుకుంటాను. మరో మాట, నిప్పన్ సిల్కు ఓ అయిదొందలు తీసుకుంటారేవిటి?'''

''అదేవిటి?''

''మళ్లీ బుట్టలో పడిపోయాను సార్!'' గురువుగారికి ఓ బుట్టలోంచి ఇంకో బుట్టలోకి దూకడం హాబీలా ఉంది. ''ఈసారి నిజం చెప్పేస్తున్నాను. ఇదీ నాపచేనే. మీ చేతిలో బంగారం పండొచ్చు. ఏదో రేటుకి తీసుకోండి.''

''చూద్దాం లెండి,'' అన్నాను.

బుట్టాగారు స్కూటరు అప్పజెప్పి, చెక్కు తీసుకుని థాంక్స్ చెప్పి వెళ్లిపోయారు.

భవిష్యత్తులో ఎవరైనా 'స్టాక్‌మార్కెట్ వీరులు' అన్న పుస్తకం రాస్తున్నప్పుడు అందులో నా పేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తారని నా విశ్వాసం. తెర వెనుక బంగార్రాజున్నా తెరమీద హీరోని నేనే కదా! నెలరోజుల తర్వాత మొత్తం- స్టాకంతా అమ్మేసి బ్రోకరు ఆఫీసు నుంచి బయటకు నడుస్తుంటే, అంతా లేచి సవినయంగా గుమ్మందాకా వచ్చి వీడ్కోలు చెప్పారు. కొంతమంది ఆటోగ్రాఫులు అడిగారు. కొంతమంది ఫోటోలు అడిగారు. బ్రోకరుగారు నాకు సన్మానం చేసి, 'మా ఊరి హర్షద్ మెహతా అని బిరుదివ్వా,'లని ముచ్చటపడ్డారు. 'అప్పుడే వద్దు, ఇల్లాంటి రెండు మూడు 'కిల్లింగ్స్' చేశాక ఇవ్వచ్చు,' అని ఆయన్ను ఆపు చేశాను.

ఈ ఘనవిజయానికి మూలకారకుడు బంగార్రాజు, బంగార్రాజు ఫోన్చెయ్యొద్దన్నాడు. ఇంటికి రావద్దన్నాడు. నిజమే. కానీ, జాక్‌పాట్ కొట్టేసి లక్షలు లక్షలు సంపాదించి, అతనికి కృతజ్ఞతలు తెలుపక పోవడం చాలా కృతఘ్నత అనిపించింది నాకు. బంగార్రాజు ఆఫీసుకి ఫోన్చేస్తే సెలవులో ఉన్నాడన్నారు. ఇంటికి ఫోన్చేస్తే టెలిఫోను కట్టయిపోయిందన్నారు. అంచేత నేనే ఓరోజు సాయంత్రం బంగార్రాజింటికి స్కూటరు మీద వెళ్లాను.

బంగార్రాజిల్లు డిప్రెషన్లో ట్రేడింగ్ రింగ్‌లా సందడి లేకుండా నిశ్శబ్దంగా ఉంది. ముందు తోటంతా సంరక్షణ లేనట్లు కలుపుమొక్కలతో నిండిపోయి వుంది. నాలుగైదుసార్లు కాలింగు బెల్లు నొక్కాక బంగార్రాజు తలుపుతీసి, నన్ను చూసి కెవ్వున కేకేసి రెండడుగులు వెనక్కు వేశాడు. నున్నటి తిరపతి గుండు, చారల పైజామా, చారల లాల్చీ- బంగార్రాజు సెంట్రలు జైల్లో యావజ్జీవ ఖైదీలా ఉన్నాడు. ఏదో పని చేస్తూ వచ్చినట్లున్నాడు- చేతిలో సుత్తి కూడా ఉంది.

నేను, ''హలో...'' అని ఓ అడుగు ముందుకు వేశాను. బంగార్రాజుకి విన్పించిందో లేదో కానీ 'హలో' అన్న శబ్దం నా చెవుల్లో వింతగా ప్రతిధ్వనించింది. నేను

అడుగు ముందుకు వెయ్యగానే అంతవరకు రాయిలా నిలబడిపోయిన అతనిలో చలనం వచ్చింది. ఇంకోసారి కెవ్వున కేకేసి చేతిలో సుత్తితో నా నెత్తిమీద ఒకటేశాడు. బుర్రకి దెబ్బ తగల్లేదుగాని తమాషాగా టింగుమని శబ్దం వచ్చి విషయం అర్థమైంది.

ఇందాకట్నుంచీ తలేవిటిరా ఇంత బరువుగా వుంది అనుకున్నాను కానీ, హెల్మెట్ నెత్తి మీద అలాగే ఉందన్న విషయం మర్చిపోయాను. అలవాటు లేని హెల్మెట్ కదా! మునిమాపువేళ బంగార్రాజు నన్ను ఆ అవతారంలో చూసి జడుసుకున్నాడంటే జడుసుకోడా? హెల్మెట్ తీసి, ''నేనే'' అన్నాను ముఖారవిందం చూపించి. ''చేతిలో ఆ సుత్తేవిటి?''

'''టీవీ చూస్తున్నాను.''

''ఏవిటి అలా ఉన్నావు? ఒంట్లో బాగుందా?''

''బాగానే ఉంది.''

''బాగా చిక్కినట్లున్నావే.''

''ఎండాకాలం కదా.''

సుత్తితో టీవీ చూడ్డమేవిటి, డిసెంబర్లో ఎండాకాల మేవిటి, మనిషి వాలకం ఇలా తయారయ్యిందేవిటి అనుకున్నాను.

''చాలాకాలం నుంచి నిన్ను కలుద్దామంటే వీలు పడలేదు. ఒకసారి మీ ఇంటికొచ్చాను. ఇల్లు తాళం వేసి ఉంది. పక్కన అడిగితే మీ ఊరెళ్లావన్నారు.''

'''ఏదో- పొలం అమ్ముదామని.''

''ఆ తర్వాత నేను ఊరెళ్లాల్సి వచ్చింది.''

బంగార్రాజు ఉలిక్కిపడ్డాడు. ''నువ్వూ పొలం అమ్మేశావా?'

''పొలం అమ్మడమేవిటి?''

బంగార్రాజు చికాగ్గా అన్నాడు. ''నువ్వు ఎందుకు వచ్చావో నాకు తెల్సు. నేను ముందే చెప్పాను- స్టాక్ మార్కెట్లో ముందేం జరుగుతుందో ఎవరికీ తెలియదని. నేను మంచిదనుకున్న షేరు నీకు చెప్పాను, నేను కొన్నాను.'' బంగార్రాజేం మాట్లాడుతున్నాడో నాకు అర్థం కాలేదు. ''నూటయాభై పెట్టి కొన్న షేరు ఇరవై ఆరుకి పడిపోతుందని నేను కలగన్నానా. శుభ్రంగా తిరపతి క్షవరమై పోయింది. ఉన్నదంతా తుడిచిపెట్టుకు పోయింది,'' అన్నాడు గుండు నిమురుకుని చూపిస్తూ.

''నాకేం నష్టం లేదు. యమా లాభం వచ్చింది.''

''బాష్...''

''నిజం గురూ, కొడితే ఏనుగు కుంభస్థలవే కొట్టా లన్నాను, గుర్తుందా? సింహం ఏనుగు కుంభస్థలాన్నే బద్దలు కొట్టేసింది నీ దయవల్ల...''

''జాటర్ ఢమాళ్...''

''జాటర్ ఢమాళ్ కాదు. నిజం చెబుతున్నాను,'' అంటూ నేను షేర్లు ఎలా కొన్నదీ, ఎలా అమ్మిందీ, ఎన్ని లక్షలు లాభం వచ్చిందీ బంగార్రాజుకి వివరంగా చెప్పాను. కథ వింటుంటే బంగార్రాజు మొహంలో రంగులు మారిపోయాయి.

''గుజరాత్ గోల్డ్ ఎందుకు కొన్నావు?'' బంగా ర్రాజులో డిటెక్టివ్ బంగార్రాజు మేల్కొన్నాడు కాబోలు, అనుమానంగా ప్రశ్నించాడు.

''నువ్వు కొనమన్నావుగా,'' అన్నాను నేను తెల్ల బోయి.

''నిన్ను కొనమన్నది, నేను కొని నాశనమైపో యింది గుజరాత్- కోల్డ్.''

''మరి నాకు అలా విన్పించిందే.''

''జాటర్ ఢమాల్, అలా విన్పించడం కాదు. ఇప్పుడు నాకు అంతా అర్థమవుతోంది.'' బంగార్రాజు కళ్ల మూసుకుని సమాధిలోకి వెళ్లిపోయి, అక్కడ నుంచి అంతర్నేత్రంతో చూస్తున్నాడిలా కొద్దిసేపుండి, మెల్లిగా కళ్ల తెరిచి, చిరునవ్వు నవ్వి- ''చిన్నయసూరిగారు మహానుభావుడు,'' పైకి చూస్తూ అన్నాడు రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ.

''ఆయనేం కిల్లింగ్ చేశాడు?''

''ఆయన ఫీల్డు స్టాక్మార్కెటు కాదు. సాహిత్యం. ఆయన కథల్లో జిత్తులమారి నక్కల గురించి చదివి నప్పుడు జిత్తులమారి నక్కలు ఎలా ఉంటాయా అని బుర్ర బద్దలు కొట్టుకునేవాణ్ణి...''

అలాంటి కథలంటే నాకూ సరదా కాబట్టి నేనూ ఉత్సాహంగా వినడం మొదలుపెట్టాను.

బంగార్రాజు చిన్నప్పుడే కోడేరు నుంచి వాలమర్రు సైకిలు మీద వెడుతుంటే చెరకుతోటల్లోంచి నక్క ఒకటి పరిగెడుతూ రోడ్డు మీదకు వచ్చిందట. అది రోడ్డు దాటుతూ ఒక క్షణం ఆగి అతనికేసి చూసిందట. అతని హృదయ ఫలకం మీద ఆ నక్కచూపు ఇప్పటికీ స్పష్టం గా ప్రింటయి ఉందట. చిన్నయసూరిగారు వర్ణించి నట్లు అది జిత్తులమారి నక్క అవునా కాదా అని చిర కాలంగా ఉన్న సందేహం.

''ఇప్పుడు తీరిపోయింది,'' అన్నాడు బంగార్రాజు నా కళ్లలోకి సూటిగా చూస్తూ.

''ఎలా?''

''దాని చూపు కూడా నీ చూపులాగానే ఉంది.''

"నేను జిత్తులమారి నక్కనా?"

"గోముఖ వ్యాఘ్రానివి, వయోముఖ విష కుంభానివి, తేనెపూసిన కత్తివి, మేకవన్నె పులివి." బంగా[్రాజు రంకెలెయ్యడం మొదలుపెట్టాడు. "అసలు గుజరాత్ గోల్డ్ ఏం చేస్తుంది?"

"తెలియదు."

"బుక్ వేల్యూ, ఈపీయస్, పీయీ రేషియో..."

"తెలియదు."

"హ్హా... హ... కంపెనీ ఏవిటో తెలియదు. ఏం చేస్తుందో తెలియదు. డివిడెండిస్తోందో, దివాలా తీస్తోందో తెలియదు. ఏం తెలియకుండానే దాంట్లో లక్షలు పెట్టేశావు, లక్షలు కొట్టేశావు. ఇదంతా నన్ను నమ్మమంటావు."

"నిజం గురూ."

"నిజం నువ్వు చెప్పొద్దు, నే చెబుతా," పత్తేదారు బంగా[్రాజు పరిశోధన పూర్తయినట్టుంది. నన్ను వారిస్తూ అన్నాడు: "గుజరాత్ గోల్డ్‌లో స్విండ్లర్స్ అమెరికా మెజారిటీ షేర్లు తీసుకోబోతోందని నీకు ఇన్‌సైడు ఇన్ఫర్మేషనొచ్చింది. ఆ సంగతి దాచిపెట్టి నా దగ్గరకొచ్చి నా సలహా మేరకు ఈ షేర్లు కొంటున్నవాడిలా (చి.సూరి గారి జి.మా. నక్కలా) నాటకమాడావు."

"నే చెప్పేది విను."

"చిన్నప్పట్నుంచీ మనం ఫ్రెండ్సువి, రూమ్మేట్లవి కదా. గురూ బంగా[్రాజూ, ఈ ఇన్‌సైడు ఇన్ఫర్మేషనొచ్చింది, నువ్వూ, నేనూ ఫిఫ్టీ ఫిఫ్టీ లాట్ పంచుకుందాం అన్నావా? నువ్వు ఓపెన్‌గా అంతా చెప్పేస్తే కష్టంలో, సుఖంలో నీకు తోడుండేవాణ్ణి కదా. రేప్పొద్దున్న నిన్ను ఇన్ సైడర్ ట్రేడింగు కింద జెయిల్లో పడేస్తే జెయిలు మేటుగా నీకు కంపెనీ ఇచ్చేవాణ్ణి కదా..."

"జెయిలేవిటి?" బంగా[్రాజు ఎక్కడ నుంచి ఎక్కడకు వెడుతున్నాడో నాకు అర్థం కాలేదు.

"ఇదే అమెరికాలో అయితే నీకు ఏడేళ్లు, నీ బావమరిదికి పధ్నాలుగేళ్లు వేసేవారు. నేనే పబ్లిక్ ప్రాసిక్యూటర్నయితే..." తను పబ్లిక్ ప్రాసిక్యూటరు కానందుకు విచారిస్తూ అన్నాడు బంగా[్రాజు. "అసలు విలనువి నువ్వు. నీకు పధ్నాలుగేళ్లు, నీ బావమరిదికి ఏడేళ్లు వేయించేవాణ్ని..."

"నా బావమరిదికి ఏడేళ్లేవిటి?"

"గుజరాత్ గోల్డ్‌లో పనిచేస్తూ నీకు ఇన్‌సైడ్ ఇన్ఫర్మేషనందించినందుకు."

ఇదివరకు గూఢచారి సినిమాలు చూసి చూసి మతి చలించిన నా స్నేహితుడొకడు హోటల్లో ఓ మూల కూర్చుని మొహానికి పేపరడ్డం పెట్టుకొని, దానికో చిల్లు పెట్టి దాంట్లోంచి వచ్చేపోయే వాళ్లందర్నీ చూస్తుండేవాడు. హోటలుకి వచ్చేవాళ్లంతా శత్రు గూఢచారులని వాడి నమ్మకం. 'అదంతా నీ పైత్యం,' అని నేనంటే, అసలు గూఢచారి ముఠా నాయకుణ్ణి నేనే అని అనుమానించి, నేను ఓ రాత్రి రెండో ఆటకి వెళ్లగా చూసి, కిటికీలోంచి నా గదిలోకి దూకి సీక్రెట్ ట్రాన్స్‌మీటర్ కోసం వెతుకుతూ రూమంతా చిందరవందర చేసి పడేశాడు. అలా ఉంది బంగా[్రాజు మానసిక పరిస్థితి. అక్కడికీ చిలక్కి చెప్పినట్టు చెప్పాను- వెధవ పుస్తకాలు చదవద్దు, బ్రెయిను ఎఫెక్టిస్తుందని, వింటేగా.

"నా బావమర్దేవిటి, ఇన్‌సైడు ఇన్‌ఫర్మేషనివ్వడమేమిటి. నాకసలు బావమర్దే లేడు," అన్నాను విషయం స్పష్టం చేస్తూ.

బంగా[్రాజు పెదాలు నవ్వుతున్నట్టుగా మెల్లిగా స్లో మోషన్లో విచ్చుకుని, జలుబు చేసిన గొర్రె దగ్గినట్టు శబ్దాలు వెలువడ్డాయి. "ఖ్ఖ... ఖ్ఖ... గ్గ... ఘ్ఘ... హ్హా... నాకు తెల్సు ఇలా అంటావని. బూర్జువాకి స్నేహం లేదు. బంధుత్వం లేదు. బంగా[్రాజు లేడు. బామ్మర్ది లేడు. వాడికి డబ్బు తప్ప ఇంకెవరూ కనుపించరు..."

"నిజం గురూ, మా మామగారికి మా ఆవిడ ఏకైక పుత్రిక."

"ఇంక నువ్వేం చెప్పొద్దు. నేను జాగ్రత్తగా ఇన్నేళ్లూ స్టాక్‌మార్కెట్లో ఉన్నవాణ్ణి. నన్ను సలహా అడగడానికొచ్చి, నీ వెధవ ఆలోచన, వెధవ సామెత అదేవిటి?"

"కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలన్నారు పెద్దలు..."

"పెద్దలెవరూ అనలేదు. ఈ వెధవ సామెత నీదే," బంగా[్రాజు ఓ రంకె వేశాడు. "ఆ వెధవ ఆలోచన నా బుర్రలో ప్రవేశపెట్టావు. ఉన్నదంతా ఓ షేర్లో పెడితే సర్వనాశనమేనని తెల్సు. కానీ శనిగాడి ప్రభావం పడ్డాకా నా బుర్ర ఎలా పనిచేస్తుంది. పోనీ ఒక్కసారి స్పెక్యులేట్ చేసి చూద్దాం అని గుజరాత్ కోల్డులోకి దిగాను. నువ్వు కుంభస్థలం కొట్టేశావు, నేను ఏనుగు కాళ్లకింద పచ్చడైపోయాను."

"నువ్వు ఆరోజు ఫోన్లో..."

ఇంక చాలు అన్నట్లు బంగా[్రాజు చెయ్యి అడ్డుపెట్టి, నన్ను వారించి, "ఇంక నువ్వేం చెప్పొద్దు. నేనంటే నీకు ఇంకా కొద్దిగా దయ ఉందా. నేను ఉరికంబం ఎక్కడం నీకు ఇష్టమేనా?" అన్నాడు.

''ఛ... ఛ... అవేం మాటలు గురూ. నీకోసం ప్రాణాలైనా ఇస్తాను.''

''నీ ప్రాణాలు నీ దగ్గరే ఉంచుకుని నేను నిన్ను మర్డరు చెయ్యకముందే వెళ్లిపో,'' అన్నాడు బంగార్రాజు కన్నీళ్లతో. ''నువ్వు నాకు చేసే మహోపకారం ఇదే.''

''నీ మూడ్ బావున్నట్లు లేదు. వస్తా,'' అన్నాను ఎందుకైనా మంచిదని లేస్తూ.

''ఇంక రావద్దు. నేనే స్వీట్లు తీసుకుని వస్తా నువ్వు శ్రీకృష్ణ జన్మస్థానంలో ఉన్నప్పుడు...''

''థాంక్స్.''

''థాంక్స్ ఎందుకు? స్వీటు నీకోసం కాదు. నా కోసవే. జెయిల్లో నీ ఎదురుగా కూర్చుని నిన్నూరిస్తూ తినడానికి,'' అన్నాడు బంగార్రాజు.

ఇంక అక్కడ ఉండడం క్షేమం కాదని వెంటనే బయటకు నడిచాను. ఇంటికి వెడుతూ మార్కెట్లో కూరలు తీసుకుని స్కూటరు స్టార్టు చెయ్యబోతుంటే, ''గురూగారూ,'' అంటూ బుట్టాగారు బెల్లూ, బ్రేకులూ లేని పాత సైకిలు తోసుకుంటూ పరిగెట్టుకొచ్చారు.

''మీరా- బావున్నారా?'' అన్నాను.

''నేనే. నా తలకాయలా ఉన్నాను,'' రెండు ప్రశ్నలకు రెండు సమాధానాలు క్లుప్తంగా చెప్పి, ''గుజరాత్ గోల్డ్ అయిదొందలు- పదో పరకో, ఎంతో కొంతకి సర్దుకుపోదాం. తీసుకుంటారా?'' పరామర్శలేవీ లేకుండా తిన్నగా బిజినెస్లోకి దిగిపోయాడు హడావుడిగా.

''అదేవిటి- నాకు అన్నీ అమ్మేశారు కదా! మళ్లీ ఎక్కణ్ణుంచి పుట్టుకొచ్చాయి ఇవి,'' అన్నాను ఆశ్చర్యంగా,

''రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం తప్పదన్నట్లు ఈ షేర్లు నన్నొదలటం లేదు సార్,'' అన్నాడు బుట్టా దుఃఖంతో.

గుజరాత్ గోల్డ్ పైకి లేవడం మొదలెట్టిన తర్వాత బుట్టాగారింట్లో ఇంటిల్లిపాదీ మూడు రోజులు తిండి తినలేదుట. తెలివితక్కువగా అమ్మేశారు. చూడండి, ఎలా పెరుగుతోందో అని సతాయించడం మొదలు పెట్టిందట వాళ్లావిడ. ఆ పోరు పడలేక బుట్టాగారు చూసి, చూసి, ఊగిసలాడి ఊగిసలాడి, చివరకు ఎనభై రెండుకి ఓ అయిదొందలు తీసుకున్నాడట. ఓ నెల్లో రేటు రెండొందలు దాటకపోతే చెవి తెగ్గోయించుకుంటానన్నాడట బ్రోకరు. అందుకని రేటు పెరిగినప్పుడు తటపటాయించేడు. ఈలోగా స్విండ్లర్స్ అమెరికా గుజరాత్ గోల్డ్లో వాటాలు తీసుకునే ఉద్దేశం తమకి లేనేలేదని స్పష్టం చేస్తూ ప్రకటన ఇచ్చింది. ప్రస్తుతం దాని రేటు పదకొండు. బ్రోకరుగారి చెవి క్షేమంగానే ఉంది కానీ, బుట్టాగారి తలెగిరిపోయింది.

'మళ్లీ బుట్టలో పడిపోయాను సార్. ఈసారి స్టాక్ మార్కెట్ నుంచి- పేంటూ షర్టూ పోతే పోనీండి- గోచీతో బయటపడితే చాలు. ఆపైన దేశం అదృష్టం,'' అన్నాడు తన బాధ్యతేం లేదన్నట్లు. ''నా గొడవేంగాని మీ బిజినెస్సెలా ఉంది?''

మన స్టాక్ మార్కెట్ విజయాలు చెబుతుంటే, తెరమీద మాధురీ దీక్షిత్ డాన్సు చూస్తున్నట్లు అతని మొహం వెలిగి, కథ పూర్తవగానే ఠక్కున ఆరిపోయింది. కొంచెంసేపు అడగాలా వద్దా అని ఆలోచిస్తున్నట్టు తటపటాయించి, ''మిమ్మల్ని అడగడం బాగోదు. మీరైతే కారో, రైలో, హెలికాప్టరో కొంటారు. ఈ సైకిలు ఎవడైనా కొంటాడేమో చూడండి. బెల్లు ఫ్రీ,'' అన్నాడు జేబులోంచి బెల్లు తీసి టింగు టింగుమనిపించి.

సరే అని, అతన్ని హోటలుకి తీసుకెళ్లి, బిల్లు నేనే చెల్లించి వెళ్లిపోతుంటే, ''సార్, మీ గురువుగారి పేరు వెండో, బంగారవో- ఏదో చెప్పారు. ఆయన్ని దర్శనం చేసుకోవాలి. అప్పుడే ఆయన్ని కల్సుంటే ఈ డొక్కు సైకిలేనా మిగిలేదేమో,'' అన్నాడు కసిగా సైకిల్ని ఓ తాపు తన్ని.

''అతని పేరు బంగార్రాజు. ఇప్పుడు కొంచెం- మానసిక పరిస్థితి- మూడ్ బాగాలేదు,'' అన్నాను వివరాలేవీ చెప్పకుండా.

''ఫరవాలేదు సార్. బంగార్రాజు- ఏం పేరు సార్. పేరులోనే బంగారం ఉంది. ఇంక ఆయన పట్టింది బంగారం కాక ఏవవుతుంది? పేరంటే అలా ఉండాల్సార్, వారు అనుగ్రహిస్తే ఉపదేశం పొందుతాను. లేకపోతే దూరం నుంచే దర్శనం చేసుకుని తరిస్తాను. వస్తా సార్,'' అంటూ షేక్ హాండివ్వబోతుంటే నా కొత్త వాచీ ఆయన కంటపడింది. ''వాచీ చాలా బావుంది సార్ గోల్డు చెయినా?''

''పద్దెనిమిది కేరట్ల బంగారం,'' అన్నాను వాచీ తీసి అతనికి అందివ్వబోతూ.

బుట్టా ఠక్కున చెయ్యి వెనక్కు లాక్కున్నాడు. ''మన జాతకం బాగాలేదు సార్. బంగారం ముట్టుకుంటే మట్టయిపోతోంది. మీ చేతినే ఉండనివ్వండి,'' అంటూ బంగార్రాజు అడ్రస్ తీసుకు వెళ్లిపోయాడు.

పైకొచ్చిన వాణ్ణి పైకి లేపేస్తుంది లోకం. ఆ తర్వాత నాకు స్టాక్మార్కెట్ మాంత్రికుడిగా పెద్ద

పేరొచ్చింది. ఎక్కడెక్కడి వాళ్లు సలహాల కోసం నా దగ్గరకు వస్తారు. నేను ఎర్ర, నీలం పెన్సిలు తీసుకుని, టిక్కులు కొట్టి 'కొనండి', 'అమ్మండి' అని కుప్తంగా సలహాలిస్తాను. లాభం వచ్చినవాళ్లు నన్ను ఆకాశాని కెత్తేస్తారు. నష్టం వచ్చినవాళ్లు నన్ను నిందిస్తారని మీరను కుంటే పొరపాటే. వాళ్లు, 'సింహంగారు మాత్రం ఏం చేస్తారు- స్టాక్‌మార్కెట్టే అంత,' అని ఏడ్చి మళ్లీ నా దగ్గరికే వస్తారు.

నేనెంత వారించినా వినకుండా స్థానిక ఇన్వెస్టర్సు క్లబ్ వాళ్లు నాకు సన్మానం చేశారు. వేదిక మీద పెద్దలు రిఫార్మ్, డంకెల్, గాట్ అంటూ ఏదో మాట్లాడారు. నాకు సగం అర్థమైంది. సగం అర్థం కాలేదు. ఆ తర్వాత నేను లేచాను. ''ఏషియా పులి- భారతదేశం- లేచింది, గర్జిస్తోంది,'' అన్నాను. పులి గర్జిస్తుందా, గాండ్రిస్తుందా! ఇల్లాంటప్పుడు బంగార్రాజు దగ్గరుంటే ఎంత బావుండేది అనుకున్నాను. బంగార్రాజు చాలా దగ్గర్లోనే పొంచి వున్నాడని నాకు తెలియదు.

''పులి గర్జించదు, గాండ్రిస్తుంది. సింహం గర్జిస్తుంది. నా పేరే సింహం. నేను గర్జిస్తాను,'' అన్నాను. అంతా చప్పట్లు కొట్టారు అదేదో జోకనుకుని. ఆ తర్వాత నేనేదో నాకు తోచింది మాట్లాడాను. వాళ్లకి సగం అర్థమైంది, సగం అర్థం కాలేదు. నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలీదు, పాపం వాళ్లకేం అర్థమవుతుంది? 'మీ స్టాక్ మార్కెట్ విజయ రహస్యం ఏవిటి?' అని నన్ను ప్రశ్నించారు. అందరి కళ్లలోనూ లక్షలు ఎలా సంపాదించేయాలా అన్న ఆశ, అలీబాబా గుహ తలుపులు తెరవడానికి మంత్రం కావాలి వాళ్లకి. బంగార్రాజు సూక్తులు గుర్తుకొచ్చి వాళ్లకు మంత్రోపదేశం చేశాను. 'తక్కువలో కొనడం, ఎక్కువలో అమ్మడం.' అది అందరికీ తెల్సిందే అయినా, ఏదో కొత్త విశేషం అయినట్టు చప్పట్లు కొట్టి ఆనందించారు.

సన్మానం, విందు అయిన తర్వాత సభ నిర్వాహకులు నా కారుదాకా వచ్చి నాకు వీడ్కోలు చెబుతుంటే, 'బూర్జువా' అన్న కేక విన్పించి అదిరిపడ్డాను.

ముతక ఖద్దరు పైజామా, ముతక ఖద్దరు లాల్చీ, భుజాన వేలాడే సంచి, పిల్లిగడ్డం- పాత గెటప్‌లోకి వచ్చేశాడు బంగార్రాజు. అతని పక్కన అదే గెటప్‌లో యస్సెన్ బుట్టా కూడా ఉన్నాడు. వాళ్లిద్దరూ నా కారుకి కొంచెం దూరంలో రోడ్డు పక్కగా నల్లజండాలు పట్టుకుని నిలబడి ఉన్నారు.

''జిత్తులమారి నక్క... మేకవన్నె వ్యాఘ్రం...'' బుట్టా నాకేసి నల్లజండా ఊపుతూ అరిచాడు.

నేను కారెక్కి వెళ్లిపోయేలోగా, చిన్నయసూరిగారు నన్ను తిట్టిన తిట్లన్నీ వల్లించాలిగానీ, ఎంత తొందరలో ఉన్నా భాషాదోషాల్ని సహించలేడు బంగార్రాజు.

''మేకవన్నె పులి, గోముఖ వ్యాఘ్రం...'' బుట్టాగారి సమాస దోషాల్ని సరిదిద్దాడు బంగార్రాజు.

''మేకవన్నె పులి... గోముఖ వ్యాఘ్రం... పయోముఖ... పయోముఖ...''

''పయోముఖ విషకుంభం. తేనె పూసిన కత్తి.''

నేను ఎందుకైనా మంచిదని వెంటనే కార్లోకి దూకి స్టార్ట్ చేశాను.

*ఇండియా టుడే పక్షపత్రిక, 16 అక్టోబర్ - 5 నవంబర్, 1994*

